క్లుప్తంగా

రెండు రోజులపాటు బస్‌పాసుల మంజూరు నిలిపివేత

చిలకలూరిపేటటౌన్: ఏపీఎస్ఆర్టీసీ చిలకలూరిపేట డిపోలో బస్‌పాస్ కౌంటర్ ఈనెల 12, 13 తేదీల్లో పనిచేయదని డిపో మేనేజర్ ప్రకటించారు. కొత్త బస్ పాస్ విధానాన్ని రీ ఇన్‌స్టాల్ చేస్తున్న కారణంగా ఈ రెండు రోజులు కౌంటర్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి పాస్ జారీ ప్రక్రియ మళ్లీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కొత్తగా బస్‌పాసులు తీసుకోవాలనుకునే విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని రావాల్సిన అవసరం ఉందని, అలా చేసిన వారికి పాస్‌లు సులభంగా జారీ అవుతుందని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు

చిలకలూరిపేట: నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కేఎల్ రావు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రవాణా, పోలీసు, ఆర్టీసీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మొత్తం 45 వాహనాలను తనిఖీ చేసి 12 వాహనాలపై ఇన్సూరెన్స్ లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకపోవడం వంటి పలు కారణాలతో కేసులు నమోదు చేశారు. వీరిపై రూ. 49,480 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్‌కు గాయాలు



నాదెండ్ల: వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలో బోల్తా పడిన సంఘటన గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో బుల్లెమ్మ బావి వద్ద బుధవారం చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామ రైతు గోపు రామారావుకు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ సుబ్బారావు మంగళవారం రాత్రి వ్యవసాయ పనుల నిమిత్తం రోటవేటర్‌తో తీసుకెళ్లాడు. ఉదయం పొలం నుంచి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తాపడింది. క్రేన్ సాయంతో బోల్తాపడిన ట్రాక్టర్‌ను వెలికితీశారు. డ్రైవర్ సుబ్బారావుకు స్వల్పగాయాలు కాగా ట్రాక్టర్ దెబ్బతింది.

నాటుసారా తయారుచేస్తే కఠినచర్యలు



బొల్లాపల్లి: నాటుసారా తయారుచేసినా, విక్రయాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు డి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈపూరు ఎక్సైజ్ స్టేషనుపరిధిలోని ఈపూరు, బొల్లాపల్లి మండలాలల్లో పలుగ్రామాలల్లో తనిఖీలు నిర్వహించారు. నవోదయ 2.0 నాటుసారా నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా తనిఖీలు, అనుమానం ఉన్నచోట్ల సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైయినా నాటు సారాతయారీ జరిగితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే నాటుసారా నిర్మూలన సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన



క్రోసూరు: స్థానిక లూథరన్ చర్చి ఆవరణలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు క్రోసూరు మండల గుడ్ షెఫర్డ్ ఇన్‌చార్జ్ టి.లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. క్రోసూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. ఫలితంగా సమాజంలో మంచి నాయకులుగా ఎదిగి, సమాజాభివృద్ధికి కృషి చేస్తారన్నారు. నిజాయతీగా స్వార్థం లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు నడిపించినవాడు మంచి నాయకుడు అన్నారు. గుడ్ షెఫర్డ్ సంస్థ కో–ఆర్డినేటర్ సిస్టర్ యాంటో మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా మారి నూతన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఆర్ఐ వెంకట్రావు, సంస్థ సిబ్బంది బత్తుల బాబు, పవన్ కుమార్, అందుకూరు బాలమర్తి, క్రోసూరు గ్రామాల బాలల పార్లమెంటు లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

బసవన్నా.. పదరన్నా..

- జోడెడ్లకు కాడికట్టి... మేడిపట్టి దుక్కిదున్నిన రైతన్నలు
- కోలాహలంగా ఏరువాక పౌర్ణమి



నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద ఎద్లతో ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

నాదెండ్ల: జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అన్నదాతలు ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని వైభవంగా జరిపారు. నేలతల్లి నుంచి ధాన్యరాశులు పండాలని, తమ కష్టానికి తగిన ప్రతిఫలం లభించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ రైతన్నలు తమ పొలాల్లో ఖరీఫ్ పనులు ప్రారంభించారు. తమ కష్టంలో తోడుగా ఉండే జోడెడ్లకు కాడి కట్టి మేడిపట్టి దుక్కిదున్నారు. ఈ సందర్భంగా మహిళా అన్నదాతలు కాడెద్లు, మేడికి పూజలు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు పడి తమ పొలాలు పచ్చగా పండి ఆశించిన దిగుబడులు రావాలని మొక్కుకున్నారు.

గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద ఉదయం రైతులు జోడెడ్లు, కాడి మేడితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి పూజలు చేశారు. చందవరంలో ఏరువాక పౌర్ణమిని పండుగలా నిర్వహించారు. గ్రామంలోని విఘ్నేశ్వర స్వామి ఆలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల వద్ద పూజలు నిర్వహించి ఏరువాక ప్రారంభించారు. ప్రతి గ్రామంలో అన్నదాతలు ఏరువాక సందర్భంగా పొలం పనులు ప్రారంభించారు. తొలిరోజు రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నటం, కాడెద్లతో దున్నిన పొలాల్లో అచ్చు తోలి విత్తనాలు నాటడం ప్రారంభించారు.

ఏరువాకా సాగాలో రన్నో చిన్నన్న...

నరసరావుపేట రూరల్: ఏరువాక పౌర్ణమిని బుధవారం మండలంలోని రైతులు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పనిముట్లకు, పశుసంపదకు పూజలు నిర్వహించి పొలంబాట పట్టారు. భూమి తల్లికి పూజలు జరిపి వ్యవసాయ పనులు ప్రారంభించారు. పెట్లూరివారిపాలెంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. రైతులతో కలిసి దుక్కి దున్నారు.

గంగన్నపాలెంలో...

చిలకలూరిపేట: రైతాంగ సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో ఏరువాక కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. దుక్కి దున్ని, ట్రాక్టర్ నడిపారు.



గణపవరంలో అచ్చు తోలుతున్న రైతు



ఏరువాక పూజల్లో పాల్గొన్న మహిళలు

సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో రూ. 8 లక్షలతో వేసిన సీసీరోడ్లు, డ్రైన్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈపూరులో..

ఈపూరు (శావల్యాపురం): రైతులు ఏరువాక కార్యక్రమం కొన్ని సంవత్సరాల నుంచి ఆనవాయితీగా జరుపుకోవటం మంచి సంప్రదాయమని ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఈపూరు మండలంలోని ఈపూరు గ్రామంలో జిల్లాస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజను ప్రారంభానికి ముందు రైతులందరూ వ్యవసాయ పరికరాలను ప్రత్యేకంగా పూజలు చేసి సాగు భూములు దుక్కులు దున్నుకోవటం సంస్కృతి సంప్రదాయలకు మంచి శుభ సూచకమన్నారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు పాడిపంటలతో సిరి సంపదలతో తులతూగాలన్నారు. ఎమ్మెల్యే సంప్రదాయ దుస్తులు ధరించి జోడు ఎద్దులతో పొలం దున్నే కార్యక్రమంలో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. 30 రకాల పీఎండీ విత్తనాలను పొలంలో చల్లారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళి, జిల్లా డీపీఎం అమలకుమారి, ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవోలు రామినేని రామారావు, వరలక్ష్మి, ఏఈవో పూరేటి అశోక, సునీత, రైతులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు రైతులు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు పాలడుగు ఆంజనేయులు నివాస గృహం ఎదుట ఉన్ననటువంటి వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. మహిళలు రైతులు స్వామివారిని దర్శించుకొని ఏరువాక పౌర్ణమి పూజలు నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది.

వడ్లమూడివారిపాలెంలో

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామ రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకను బుధవారం నిర్వహించారు. వ్యవసాయ పనిముట్లకు వినాయకుని దేవాలయంలో పూజలు నిర్వహించి పొలం బాట పట్టారు. పొలంలో భూదేవికి పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ వేడుకలను రైతులందరూ మూకుమ్మడిగా నిర్వహించారు.



ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఏరువాక కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పెట్లూరివారిపాలెంలో ఎరువాకలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నాదెండ్లలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



వడ్లమూడివారిపాలెంలో వ్యవసాయ పనిముట్లతో పొలానికి పయనమైన రైతులు

హలం పట్టి.. పొలం దున్ని



ఏరువాక పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: రైతులకు ఏరువాక పౌర్ణమి మొదటి పండుగ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామంలో ఆయన భూమాతకు పూజ చేసి, హలం పట్టి కోడెలను అదిలించి, దుక్కి దున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు, రైతు కూలీలకు ఏరువాక శుభాకాంక్షలు తెలియజేశారు. దక్షిణాది రైతులకు ఏరువాక పౌర్ణమి మొట్ట మొదటి పండుగ అన్నారు. పౌర్ణమి నాడే పంటల సాగు పనులకు రైతాంగం శ్రీకారం చుట్టుతుందన్నారు. పంటలు బాగా పండి రైతు, రైతు కూలీలు సంతోషంగా ఉండాలని ఆకాక్షించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు దగ్గరికి వచ్చే విధంగా చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాలన్నిటికి తిలోదకాలు ఇచ్చిందాన్నరు. రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వంలో పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది ఐనా పంటలు బాగా పండి రైతులకు గిట్టుబాటు ధర రావాలని ఆకాక్షించారు. రైతు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పొగాకు పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కురుగుంట శ్రీనివాసరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, పడాల చక్రారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, పానుగోటి వెంకట్రావు, గెల్లి చిన కోటిరెడ్డి, మోతుకూరి వెంకటేశ్వర్లు, పానుగోటి నాసరరావు, మానుకొండ వాసుదేవ రెడ్డి, యర్రయ్య, కల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా?

- ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- వైఎస్సార్ సీపీ అంతానికి కూటమి కుట్ర చేస్తోంది



నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్‌లో లా అండ్ ఆర్డర్ అనేది అమలులో ఉందా? అని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, ఆ పార్టీని అంతం చేసేందుకు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. పొదిలి పర్యటనకు వెళ్లిన జగన్‌పై టీడీపీ శ్రేణులు రాళ్లు, చెప్పులతో దాడి చేశారని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిని తామందరమూ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్‌పై దాడి చేయడం చూస్తుంటే ఆయనను పథకం ప్రకారం అంతమొందించాలని కూటమి కుట్ర చేస్తున్నట్టు స్పష్టమౌతుందన్నారు. సాక్షి లేకపోతే తాము చెప్పిందే ప్రజలు వినాలని భావిస్తున్నారన్నారు. ఒక్క ఏడాదిలోనే ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకత, ప్రతిపక్షం పుంజుకోవటం చూసి దాడులకు దిగారన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు రోజుకొకటి వెలుగు చూస్తుంటే దాన్ని పట్టించుకునే పరిస్థితి కన్పించటం లేదన్నారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉండి ఈ అఘాయిత్యాలను నిరోధించడంలో విఫలమయ్యారన్నారు. కొమ్మినేనిపై కేసు ఏ రాజ్యాంగం, చట్టం ప్రకారం పెట్టారని ప్రశ్నించారు. ఇది మొత్తం లోకేష్ రాజ్యాంగం ప్రకారం జరుగుతోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని అణచి వేయాలనుకుంటే ఒక బంతి లాగా తిరిగి అధికారంలోకి వస్తాడని, వీరందరికీ బుద్ధి చెప్పే కార్యక్రమం తప్పకుండా జరుగుతుందని హెచ్చరించారు.

జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష



లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తి ఎన్. లావణ్య

నరసరావుపేట టౌన్: పట్టణంలోని న్యాయస్థానం ఆవరణలో జులై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం సమావేశం నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.లావణ్య మాట్లాడుతూ సివిల్, రాజీ పడదగిన క్రిమినల్, ఎన్ ఐ యాక్ట్ కేసులు, ఎంవీవో పి. బ్యాంక్, చిట్‌ఫండ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి సహకరించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వేంకట సుబ్బారావు, పలువురు న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

శావల్యాపురం: ఉపాధి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పంట సంజీవని నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఎరువు గుంతలు నూరు శాతం పనులు ఈనెలాఖారుకు పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్స్ పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. పంట కాల్వలు, పూడికతీత పనులు, తదితర పనులన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు త్వరలో వారి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఏపీవో కె.రామారావు ఉన్నారు



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టులో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట టౌన్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామిరెడ్డిపేటలో గల రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ ఆశ్రమంలో ఉన్న వృద్ధ మహిళల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవలసినదిగా ఆమె కోరారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ కార్యదర్శి శ్రీరామినేని ప్రసాద్, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, మొదటి పట్టణ పోలీసులు, ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి ఆశీర్వాదం పాల్

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

చిలకలూరిపేట: స్వచ్ఛంద సంస్థలు అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 20 మంది విద్యార్థులకు ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున మొత్తం రూ. లక్ష ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, కార్యదర్శి కె.విజయలక్ష్మి, కారుమంచి శివరావు, టి.బసవమ్మ, ఎండీ కరిమా, డాక్టర్ ప్రహ్లాదేవి, డాక్టర్ వై.మధులత, జి.సరోజిని, ఎన్.సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

గోగులపాడులో పర్యటించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు పర్యటించారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జ్ పోలెపోగు రాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్హులైన వారికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఏర్పడి 31 సంవత్సరాలు కావస్తుందన్నారు. వచ్చే నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించి, ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మక్కెన పుట్టయ్య, మండల నాయకులు బందెల జేమ్స్, బందెల బాబు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

సత్తెనపల్లి: ఎన్ఆర్ఐ గుండవరపు అనిల్ కుమార్ సేవలు వెలకట్టలేనివని గోశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలో వంగర బ్రహ్మయ్య, గంజి వీరాస్వామి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం వీరి కుమారుడు ఎన్ఆర్ఐ గుండవరపు అనిల్ కుమార్ ధర్మపత్ని జయశ్రీ ఆర్థిక సహాయంతో బుధవారం 30 మంది నిరుపేదలకు, వృద్ధులకు నిత్యావసర సరుకులు, మామిడి పళ్ల పంపిణీ చేశారు. అంతేకాకుండా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకంలో 140 మందికి ఉచితంగా అన్నసంతర్పణ నిర్వహించారు. స్థానికులు కట్టా శివ దుర్గారావు, దివ్వెల శ్రీనివాసరావు, గంగూరు కళ్యాణ్, గంగూరి విద్య, అప్పాపురపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



చేనేతకాలనీలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కాశీ మల్లేశ్వరరావు

ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్

క్రోసూరు: మండలంలోని ఊటుకూరులో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ ఆధ్వర్యంలో బుధవారం యోగాపై అవగాహన ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ ఈనెల 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున మండలంలో జూన్ 21 వరకు ప్రతిరోజు యోగాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. ఒత్తిడి రహిత జీవితానికి యోగ ఉపయోగపడుతుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాబుల వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న శిఖా శ్యాంసన్, మాబుల, సాంబశివరావు, ఆరోగ్య కార్యకర్తలు

రేపు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: మండలంలోని పలనాటి కోనసీమగా పేరు పొందిన మంచికల్లులో పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు బుధవారం తెలిపారు.

ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం, వివిధ రకాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల వార్షికోత్సవ వేడుకలలో పాల్గొనే భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహంతో మేళతాళాలతో గ్రామోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకలలో పాల్గొని అమ్మవారి చల్లని దీవెనలు పొందాలని ఆయన కోరారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అందంగా ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు.



స్వచ్ఛ భారత్ పై కళాజాత



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో అసిస్ట్–ఐటీసీ సంస్థల సౌజన్యంతో స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై కళాజాతర మేలుకొలుపు బృందం సభ్యులు పాటల ద్వారా అవగాహన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాజాతర టీం సభ్యులు మరుగుదొడ్ల వినియోగం, బాల్య వివాహాలు చేయటం వలన జరిగే అనర్థాలు, తడి–పొడి చెత్త లాంటి వ్యర్థాలను సక్రమంగా గ్రామంలో శానిటేషన్ కార్మికులకు అందించడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పాటల రూపంలో అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనేజరు కొండ్రు ఏసోబు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, కళాజాతర టీం సభ్యులు వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

పిడుగురాళ్ల: పట్టణంలోని మాయాబజార్ రోడ్డులోని శ్రీ రామ తీర్థ ఆశ్రమంలోనీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణాన్ని నిర్వహింపజేశారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.